ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

ఉమ్మడి జిల్లా డిప్యూటీ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న

జహీరాబాద్, నవంబర్ 16: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని, ప్రతిఒక్కరూ బస్సులోనే ప్రయాణించాలని ఉమ్మడి జిల్లా డిప్యూటీ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న అన్నారు. శనివారం స్థానిక డిపోను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గత నెలలో ఆర్టీసీకి ఆదాయం సమకూర్చడంలో ఎలాంటి రిస్క్ లేకుండా ఉత్తమ పనితీరును కనబర్చిన ఉద్యోగులకు సన్మానించి, నగదు, ప్రగతి చక్రం పురస్కారాలను అందజేశారు. అనంతరం డిపోలోని ట్రాఫిక్, గ్యారేజ్ సెక్షన్లను ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డ్రైవర్లకు ఇంధన పొదుపు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం బస్టాండ్‌లో ప్రయాణికులతో కాసేపు మాట్లాడారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జహీరాబాద్ డిపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గ్యారేజీ ఇన్‌చార్జి తిరుమలేశ్, ఆర్టీసీ సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతిచక్రం పురస్కారాలను అందజేస్తున్న ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న

పాముకాటుతో బాలుడు మృతి

భానుప్రసాద్(ఫైల్)

ఝరాసంగం, నవంబర్ 16: పాముకాటుతో బాలుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మాచునూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధనసిరి బాబు మీనా దంపతుల కుమారుడు భానుప్రసాద్(12) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలకు సెలవు కావడంతో తల్లి వెంబడి పొలానికి వెళ్లాడు. పత్తి చేనులో పాముకాటు వేయడంతో జహీరాబాద్ దవాఖానలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. విద్యార్థి మృతి చెందడంతో పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు సంతాపం ప్రకటించారు. బాలుడి మృతితో మాచునూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ముగ్గురు విద్యార్థుల అదృశ్యం

మనోజ్ కుమార్, అఖిల్, మల్లికార్జున్

బొల్లారం, నవంబర్ 16: ఆదర్శ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అదృశ్యమైన ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మనోజ్‌కుమార్, నిఖిల్, మల్లికార్జున్ శనివారం మధ్యాహ్నం పాఠశాల ప్రహరీ దూకి పారిపోయారు. ఈనెల 14న పాఠశాలలో బాలల దినోత్సవం జరుగుతున్న సమయంలో ముగ్గురు పాఠశాల భవనం పైకి వెళ్లి సిగరెట్లు కాల్చారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి విద్యార్థులను మందలించి వదిలేశారు. మరుసటి రోజు విద్యార్థుల ప్రవర్తనపై ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మనోజ్ తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తుండగా శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ముగ్గురు కలిసి పాఠశాల గోడ దూకి పారిపోయారు. సీఐ గంగాధర్‌కు ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్‌తో కలిసి సీఐ తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రవర్తనపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరికైనా కనిపిస్తే బొల్లారం పోలీసులకు 87126 56729, 87126 61841 నంబర్లలో సమాచారం ఇవ్వాలని కోరారు.

కొనసాగుతున్న సర్వే

పటాన్‌చెరు, నవంబర్ 16: రుద్రారం గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేను కార్యదర్శి రాజ్‌కుమార్ పరిశీలించారు. శనివారం పటాన్‌చెరు మండలం రుద్రారంలో మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి నివాసంలో సర్వే సిబ్బంది సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. గ్రామ కార్యదర్శి రాజ్‌కుమార్ సర్వే నిర్వహణను పరిశీలించి పలు సూచనలు చేశారు. సుధీర్‌రెడ్డి కుటుంబ సమాచారాన్ని సర్వే సిబ్బంది నమోదు చేసింది. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వం విధించిన టార్గెట్‌ను సకాలంలో పూర్తి చేస్తామన్నారు. రుద్రారంలో సర్వే నిరాటకంగా కొనసాగుతున్నదని తెలిపారు.

పారపాట్లు జరగొద్దు

కంగ్టి, నవంబర్ 16: గ్రామాల్లో కొనసాగుతున్న కుల గణన సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని కంగ్టి ఎంపీడీవో సత్తయ్య అన్నారు. శనివారం మండలంలోని నాగూర్(కె) గ్రామంలో ఇంటింటా కొనసాగుతున్న సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో 35 కుటుంబాల్లో సర్వే పూర్తయిందని వెల్లడించారు.

లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలి

రామచంద్రాపురం, నవంబర్ 16: బీహెచ్‌ఈఎల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్ సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించడంతోపాటు తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేసినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని అధిరోహిస్తారని సూచించారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదువుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.

NT-338958-All

సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

పటాన్‌చెరులో సబ్‌స్టేషన్ల ఏర్పాటు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఈ కామేశ్

రామచంద్రాపురం, నవంబర్ 16: సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో కరెంట్ సమస్యలు పరిష్కారమవుతాయని మేడ్చల్ జోన్ విద్యుత్ శాఖ సీఈ కామేశ్ అన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు భారతీనగర్ డివిజన్‌లోని బీడీఎల్ కాలనీ, పటాన్‌చెరులోని ఎంపీపీ కార్యాలయం ఆవరణంలో కేటాయించిన స్థలాలను ఎస్ఈ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సమ్మర్‌ని దృష్టిలో పెట్టుకొని సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ అడుగులు వేస్తున్నదన్నారు. బీడీఎల్ కాలనీ రాయసముద్రం చెరువుని ఆనుకొని ఉన్న స్థలాన్ని, పటాన్‌చెరులో ఎంపీపీ కార్యాలయం ఆవరణంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు స్థలాలను కేటాయించినట్లు తెలిపారు. ఆర్సీపురం, భారతీనగర్ డివిజన్లతోపాటు పటాన్‌చెరులో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉన్నదని, వచ్చే సమ్మర్‌ని దృష్టిలో పెట్టుకొని తప్పనిసరిగా సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈఈ కృష్ణారెడ్డి, డీఈ భాస్కర్, ఏడీఈ సంజీవ్, ఏఈలు ఉన్నారు.

కనుల పండువగా తులసీ కల్యాణం

భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో తులసీ కల్యాణాన్ని నిర్వహిస్తున్న భక్తులు

గుమ్మడిదల, నవంబర్ 16: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని పలు శైవ క్షేత్రాల్లో తులసీ కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి మండలంలోని బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో ఈవో శశిధర్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య ఆధ్వర్యంలో తులసీ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మద్దీ ప్రతాప్‌రెడ్డి, తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం కార్తిక దీపోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సురభినాగేందర్‌గౌడ్, వీరన్నగూడెం మాజీ సర్పంచ్ పొన్నబోయిన మమతావేణు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సన్మానం

మునిపల్లిలో జర్నలిస్టులను సన్మానిస్తున్న పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్

మునిపల్లి, నవంబర్ 16: సమాజంలో ఫోర్త్ ఎస్టేట్‌గా మీడియా నిలుస్తున్నదని పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గంధం సరస్వతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునిపల్లి జడ్పీహెచ్ ఎస్‌లో స్థానిక జర్నలిస్టులను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం కల్పన, ఉపాధ్యాయులు ఉషశ్రీ, స్వరూప, ఆంజనేయులు, కరుణాకర్ రెడ్డి, సుభాష్‌రావు, చంద్రమౌళి, కవిత, మధురిమ, అరుణ, ప్రవీణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ పాషా, అష్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.

రిపోర్టర్లను సన్మానించిన అధికారులు

కత్తి కన్న కలం గొప్పది

పుల్కల్, నవంబర్ 16: కత్తి కన్న కలం గొప్పది, సమాజంలో విలేకరుల సేవలు ఎనలేనివని పుల్కల్ తహసీల్దార్ కృష్ణ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజంలో ఏది ఆశించకుండా నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తారన్నారు. పత్రికల్లో వచ్చే కథనాల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఎవరినైనా ప్రశ్నించే హక్కు ఒక్క మీడియాకే ఉందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక రిపోర్టలను సన్మానించి మెమొంటోలు అందజేశారు. ఎంఈఓ శంకర్, టీపీటీఎఫ్ నాయకులు సుభాష్, శ్రీకాంత్ ఉన్నారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

మహేందర్ గౌడ్ (ఫైల్)

కౌడిపల్లి, నవంబర్ 16: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని కంచాన్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కీసరి మహేందర్ గౌడ్(34) కొంతకాలంగా బొంతపల్లిలోని హోనర్‌ల్యాబ్ యూనిట్-1లో డ్రైవర్ కం లేబర్‌గా విధులు నిర్వహిస్తూ ఉండగా నెల క్రితం కంపెనీకి చెందిన చెత్త బండి నడుపుతున్న క్రమంలో వెనకాల కూర్చున్న గుమ్మడిదల గ్రామానికి చెందిన వ్యక్తి ట్రాలీలో కూర్చొని ఉన్నట్టుండి ట్రాలీలో నుంచి పడిపోయాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు డబ్బులు డిమాండ్ చేయగా అప్పటి నుంచి దిగులుగా ఉంటూ మనస్థాపం చెంది ఈనెల 10న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని మెదక్ రష్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా ఈ నెల 15న మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని సూచించగా అతన్ని నిమ్స్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు కరుణాకర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గురునానక్ జయంతి

సంగారెడ్డి బ్రాహ్మణవాడలోని గురుద్వారలో గురునానక్ 555వ జయంతిని పురస్కరించుకొని శనివారం సిక్కు పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానిక గురుద్వార నుంచి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ఊరేగింపుగా వెళ్లి విన్యాసాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సిక్కు పెద్దలు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సిక్కు మహిళలు పాల్గొన్నారు.

- నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి జిల్లా

పద్మశాలీల అభివృద్ధికి కృషి

నియమాక పత్రాలను అందుకున్న పద్మశాలీ నేతలు

సిద్దిపేట టౌన్,నవంబర్ 16 : పద్మశాలీల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి భిక్షపతి అన్నారు. పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యవర్గంలో సిద్దిపేటకు చెందిన పద్మశాలీ నేతలకు ఉన్నత పదవులు దక్కాయి.ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శిగా భిక్షపతి, కార్యదర్శులుగా ముదిగొండ శ్రీనివాస్,మల్లిఖార్జున్,తిరుపతి లకు రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ శనివారం నియామక పత్రాలు అందజేశారు.

- పగలు రెక్కీ.. రాత్రి వేళలో చోరీలు
- వరుస దొంగతనాలో ఆందోళనలో ప్రజలు
- క్లూస్‌టీం ఆధారాలు సేకరించినా ఫలితం శూన్యం

వామ్మో దొంగలు!

గుమ్మడిదలలో జీవరత్నం ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూటీం(ఫైల్)

గుమ్మడిదల, నవంబర్ 16: ఇంటికి తాళం వేశారా.. తస్మాత్ జాగ్రత! గంట రెండు గంటలపాటు ఆలయానికి వెళ్లినా, పెండ్లికి వెళ్లినా, వ్రతాలకు వెళ్లినా అదును చూసి కాపు కాసి దొంగలు తాళాలను పగలుగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు. ఇండ్లకు సీసీ కెమెరాలు ఉన్నా జాగ్రత్త పడుతున్నారు. కెమెరాలు ఉన్న ఇండ్లకు దొంగలు ముఖాలకు మాస్కులు, చేతులకు గ్లౌసులు పెట్టుకొని గుర్తు పట్టకుండా జాగ్రతలు తీసుకుంటున్నారు. పక్క ప్లాన్‌గా చోరీలకు పాల్పడుతున్నారు. పగలు సమయంలో రెక్కీ నిర్వహిస్తూ రాత్రి సమయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ముందుగానే ఏఇంటికి తాళం ఉంది, ఏ రోజు నుంచి ఉంది, దొంగతనానికి అనువైన ఇళ్లేనా అనే కోణంలో ప్లాన్ చేసుకుంటున్నారు. దీని ప్రకారం రాత్రి వేళలో చోరీలు చేస్తున్నారు. దూరంగా ఉన్న ఇండ్లలో పట్టపగలే చోరీలకు తెగబడుతున్నారు. పట్టపగలు జాతీయరహదారి పక్కన ఉన్న ఇండ్లలో కూడా దర్జాగా దొంగతనాలు చేసి విలువైన బంగారు ఆభరణాలు, నగలు, నగదు ఎత్తుకెళ్తున్నారు.

వ్రతానికి వెళ్లి వెచ్చేలోపు అంతామాయం

గుమ్మడిదల మండల కేంద్రంలో ఇటీవల చిమ్ముల రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు పక్కింట్లో నోము, సత్యనారాయణ వ్రతం చేసుకుంటున్నారని వెళ్లారు. వచ్చేలోపు 31.5 తులాల బంగారు ఆభరణాలు(రూ.24లక్షల విలువైన బంగారం), 10 తులాల వెండి, నగదు కాజేశారు. ఈ ఘటనలో పోలీసులు కొంత రికవరీ చేశారు. అంతటితో ఆగక శ్రీనివాస్‌నాయక్ పక్క గ్రామానికి వెళ్లగా ఇంటి తాళం పగలుగొట్టి ఐదు తులాల వెండి, రూ.15 వేల నగదు చోరీ చేశారు. బాధితులు లబోదిబో అంటున్నారు. రెండు నెలల క్రితం గుమ్మడిదల జాతీయ రహదారి పక్కన ఉన్న రత్నయ్య ఇంట్లో చోరీ జరిగింది. సూమారు రూ.5 లక్షల వరకు బంగారంతో పాటు నగదు చోరీ చేశారు.

జిన్నారం మండలంలో..

జిన్నారం మండలంలోని దాదిగూడెంలో ఒక ఇంట్లో నాలుగు తులాల బంగారం, నగదు చోరీకి గురైంది. ఊట్ల గ్రామంలో రాత్రి వేళలో సీసీ కెమెరాలు ఉండగా ముఖం కనిపించకుండా తాళం పగలగొట్టడానికి యత్నించారు. ఇలా దొంగలు అదను చూసి వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. వరుస దొంగతనాలపై పోలీస్‌లు కేసు నమోదు చేసుకొని క్లూస్ టీం ఆధారాలతో, సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. వరుస దొంగతనాలు జరుగుతున్నా దొంగలను పోలీసులు పట్టుకోలేకపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళలో పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని కోరుతున్నారు. ప్రతి గ్రామంలో కొత్తవారిని, అపరిచితులను నమ్మరాదని పోలీసులు సూచిస్తున్నారు. అనుమానం వచ్చిన వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నారు.

'నిమ్జ్' డిప్యూటీ కలెక్టర్‌గా రాజు

జహీరాబాద్, నవంబర్ 16: జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్‌గా బి.రాజు బాధ్యతలు స్వీకరించారు. శనివారం పట్టణంలోని నిమ్జ్ ప్రాజెక్టు కార్యాలయంలో ఆయన డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ నిమ్జ్ ప్రాజెక్టు 1, 2 విభాగాలకు డిప్యూటీ కలెక్టర్లుగా నాగలక్ష్మి, రాజేందర్‌రెడ్డి విధులను నిర్వహించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇరువురూ వెళ్లిపోవడంతో స్థానిక ఆర్డీవో రాంరెడ్డికి డిప్యూటీ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. జహీరాబాద్ అర్డీవోగా పనిచేసిన రాజు బదిలీపై మహబూబ్‌నగర్‌కు వెళ్లారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్‌గా రాజు తిరిగి బదిలీపై జహీరాబాద్‌కు వచ్చారు. ఆయనకు కార్యాలయ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. కార్యక్రమంలో నిమ్జ్ ప్రాజెక్టు అధికారులు ఉన్నారు.

జహీరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- కల్వర్టును ఢీకొట్టిన కారు: ఇద్దరు హైదరబాదీల మృతి
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఘటన

సురేశ్‌కుమార్, నర్సింహారావు(ఫైల్)

జహీరాబాద్ సమీపంలో కల్వర్టును ఢీ కొట్టడంతో నుజ్జునుజ్జయిన కారు

జహీరాబాద్, నవంబర్ 16: దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన జహీరాబాద్ పట్టణ సమీపంలోని ఆదర్శనగర్ పరిధిలోని 65వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. జహీరాబాద్ పట్టణ పోలీసులు కథనం ప్రకారం.. హైదరాబాద్ పట్టణ ప్రాంతంలోని సూరారంలోని శివాలయం కాలనీకి చెందిన సురేశ్, సంజీవ్‌రావు, శివకుమార్, మనోజ్ కలిసి కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా ప్రాంతంలోని గానుగపూర్ దత్తాత్రేయ స్వామి ఆలయానికి దర్శన నిమిత్తం వెళ్లారు. స్వామివారి దర్శన అనంతరం తిరిగి శుక్రవారం రాత్రి కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీ సమీపంలో కారు అదుపు తప్పి జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టును బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ సిబ్బందితో హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న వారిలో సురేశ్‌కుమార్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా తీవ్రగాయాలైన సంజీవ్‌రావు, మనోజ్, శివకుమార్‌ను చికిత్స నిమిత్తం పోలీసులు జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వీరి పరిస్థితి ఆందోళనకారంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో మార్గమధ్యంలోనే తీవ్రగాయాలైన నర్సింహారావు మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు మనోజ్, శివకుమార్‌ను సంగారెడ్డికి తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వీరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. నిద్రమత్తులోనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ పేర్కొన్నారు.

మంత్రుల పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

జోగిపేటలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

అందోల్, నవంబర్ 16: ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం జోగిపేటలో నిర్వహించనున్న కార్యక్రమానికి మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ హాజరుకానున్నారు. శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లును అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులతో కలిసి పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా ప్రజాపాలన-ప్రజావిజయోత్సవాల పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, అందులో భాగంగా జోగిపేటలో నిర్వహించే కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, తహసీల్దార్ విష్ణుసాగర్, డీటీ మధుకర్‌రెడ్డి, కమిషనర్ తిరుపతి, శానిటరి ఇన్‌స్పెక్టర్ వినయ్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

కనకయ్య(ఫైల్)

పుల్కల్, నవంబర్ 16: మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం ఉదయం పుల్కల్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మిన్పూర్ గ్రామానికి చెందిన చాకలి కనకయ్య(35) శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం పుల్కల్ శివారులోని కాశోల్ల కుంట సమీపం వద్ద కాల్వలో విగతజీవిగా పడి ఉండటం చూసి మిన్పూర్ గ్రామస్తులకు తెలియజేశారు. పంటలకు పిచికారీ చేసే పురుగుల మందు తాగి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఇంటికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కనకయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటేశం తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బీరప్ప బస్తీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ చంద్రారెడ్డి

బొల్లారం నవంబర్ 16: సీసీ రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు బీరప్ప బస్తీలో పర్యటించి సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. బస్తీవాసుల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు భాస్కర్, నాయకులు సంపత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కార్యకర్త కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, నవంబర్ 16: నారాయణఖేడ్ మండలం పోతన్‌పల్లి(ఆర్) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఉప్పరి నాగన్న మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు రవీందర్‌నాయక్, నాయకులు నర్సింహులు, కృష్ణ, సాయిరెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శంకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సిద్దిపేట విద్యార్థి

మణిప్రసాద్‌ను అభినందిస్తున్న విద్యాధికారి రవీందర్‌రెడ్డి

సిద్దిపేట కమాన్, నవంబర్ 16